క్లుప్తంగా

మంత్రి వేణును కలసిన ఎమ్మెల్సీ అభ్యర్థి



మంత్రి వేణును కలసిన కర్రి పద్మశ్రీ

రామచంద్రపురం: గవర్నర్ కోటా నుంచి ఎమ్మెల్సీగా ఎంపికైన కర్రి పద్మశ్రీ రాష్ట్ర బీసీ సంక్షేమం శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు. పట్టణంలోని క్యాంపు కార్యాయలం వద్ద మంత్రి వేణును కలసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి నారాయణరావు పాల్గొన్నారు.

నేడు నూతన ఆలయ విగ్రహావిష్కరణ

కె.గంగవరం: మండలంలోని అముజూరులో నూతనంగా నిర్మించిన వరసిద్ధి వినాయక ఆలయ విగ్రహావిష్కరణ నేడు నిర్వహించనున్నారు. విగ్రహావిష్కరణ సందర్భంగా గత మూడు రోజులుగా ఆలయం వద్ద వేదపండితులు బ్రహ్మత్వంలో సంకల్పం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనము, మండప హోమాలు, లక్ష్మీగణపతి అష్టద్రవ్య హోమాలు ఘనంగా నిర్వహించారు. నేడు ఉదయం 7.30 విగ్రహ ప్రతిష్ఠ అనంతరం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఇంటిలో ఇత్తడి సామానుల చోరీ

రామచంద్రపురం రూరల్: రాత్రి సమయంలో ఇంటిలోకి దొంగలు చొరబడి ఇత్తడి సామానులు దొంగిలించుకుపోయినట్లు అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ సోమవారం విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని భీమక్రోసుపాలెంలో కూనిశెట్టి సూర్యప్రసాద్‌రెడ్డి ఇంటిలో ఈ నెల 25న రాత్రి సమయంలో తలుపులు పగులగొట్టి ఇంటిలోని రూ.65 వేలు విలువైన ఇత్తడి సామానులు ఎత్తుకుపోయారు. బాధితుడి ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఘనంగా గంధోత్సవం

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో వేంచేసిన హజరత్ సయ్యద్ షాబాజ్ ఔలియా బాబా గంధోత్సవం సోమవారం మసీదు కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాబా గంధం, జెండాల ఊరేగింపు సాయంత్రం జనాబ్ మీరా షరీఫ్(ముతవల్లి) ఇంటి నుంచి గ్రామ ప్రధాన వీధుల్లో నిర్వహించారు. బాబాకు గంధం పూసి, అజ్మీర్ నుంచి తెచ్చిన చాదర్‌ను మత గురువు గులుఫ్ రాజా ఆలం, మసీదు కమిటీ అధ్యక్షుడు సయ్యద్ ఫాజిల్ అజారుద్దీన్, కమిటీ సభ్యుల చేతుల మీదుగా బాబాకు వేశారు. బాబా ప్రసాదం భక్తులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో మసీదు కమిటీ కార్యదర్శి బాబులాల్, సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయ ఈఓకు ఉద్యోగ జేఏసీ సత్కారం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి దేవస్థానం ఈఓ పి.తారకేశ్వరరావును ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు మంగళవారం కార్యాలయంలో కలసి సత్కరించారు. ఆలయంలో నూతన రథ నిర్మాణం, స్వామివారి కల్యాణోత్సవాలు, మహా శివరాత్రి పర్వదినం గతానికంటే అంగరంగ వైభవంగా నిర్వహించారంటూ అభినందించారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈఓ చేసిన ఏర్పాట్లు భక్తుల మన్ననలు అందుకున్నాయన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ ఉపాధ్యక్షుడు మాధవరపు వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రామచంద్రపురం యూనిట్ అధ్యక్షుడు చిక్కాల సూర్యనారాయణ, కార్యదర్శి కారుపర్తి శ్రీనివాస్, రాయవరం తాలూకా ఎన్జీఓ మాజీ అధ్యక్షుడు నల్లమిల్లి సంజీవరెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు కనకాల వీరభద్రరావు, రాంబాబు, మేడిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

రామకృష్ణకు ఘన సత్కారం



జగన్నాయకులపాలెం సర్పంచ్ రామకృష్ణను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

రామచంద్రపురం రూరల్: కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితుడైన జగన్నాయకులపాలెం సర్పంచ్ అనిశెట్టి రామకృష్ణను సోమవారం మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఘనంగా సత్కరించారు. ఎంపీపీ అంబటి భవాని ఆధ్వర్యంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు రామకృష్ణ ఇంటి వద్ద పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. దుశ్శాలువ, పూలమాలలతో సత్కరించారు. రామకృష్ణ మాట్లాడుతూ వైఎస్ జగన్ ఆశయాల సాధనకు తన వంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో ఇంతటి బాధ్యత అప్పగించిన మంత్రి వేణుకు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, సాకా బాబీ, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ద్వారపూడి రోడ్డుకు మహర్దశ

- నిర్మాణ పనుల వేగవంతానికి కసరత్తు
- ఇప్పనపాడు నుంచి జెడ్.మేడపాడు వరకూ బీటీ రోడ్డు పూర్తి
- 2,600 మీటర్ల మేర పూర్తయిన సీసీ రహదారులు
- చెట్ల తొలగింపు పనులు ముమ్మరం



జెడ్.మేడపాడు నుంచి ఇప్పనపాడు మధ్య పూర్తయిన బీటీ రోడ్డు



రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా తొలగిస్తున్న చెట్లు

మండపేట: ద్వారపూడి రోడ్డు నిర్మాణ పనుల వేగవంతానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఇప్పనపాడు నుంచి జెడ్ మేడపాడు వరకూ బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. అలాగే తాపేశ్వరం, ఇప్పనపాడు గ్రామాల్లో 1,850 మీటర్ల పొడవునా ఒక వైపు, 750 మీటర్ల పొడవునా రెండు వైపులా సీసీ రోడ్డు పనులు పూర్తయ్యాయి. రోడ్డు విస్తరణకు అడ్డంగా ఉన్న చెట్ల తొలగింపు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల ప్రజలు ద్వారపూడి, రాజమహేంద్రవరం వెళ్లేందుకు తాపేశ్వరం–ద్వారపూడి రోడ్డు మీదుగానే రాకపోకలు సాగించాలి. ప్రయాణికులతో పాటు, గ్రావెల్ లారీలు, రైస్‌మిల్లులకు వచ్చిపోయే లారీలు, ఇతర భారీ వాహనాల రాకపోకలతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. అయితే పదేళ్లుగా ఈ రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదు. ఎక్కడికక్కడ భారీ గోతులు పడ్డాయి. ఈ రోడ్డుపై ప్రయాణం ప్రమాదభరితంగా తయారైంది. మండపేట నుంచి జెడ్ మేడపాడు వరకూ దాదాపు 5.5 కిలోమీటర్ల పొడవైన ఈ రోడ్డు అభివృద్ధికి గతంలోనే సెంట్రల్ రోడ్ ఫండ్స్ నుంచి రూ.12 కోట్లు మంజూరయ్యాయి. ఆ నిధులు సరిపోవన్న ఉద్దేశంతో కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు మొదలుకాలేదు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో విశాఖకు చెందిన సుధర్మ కన్‌స్ట్రక్షన్స్ పనులు చేపట్టింది.

బీటీ రోడ్డు పూర్తి

మండపేట బైపాస్ వంతెన వద్ద నుంచి తాపేశ్వరం మలుపు వరకు, అలాగే ఇప్పనపాడు రైస్‌మిల్లు వద్ద నుంచి జెడ్ మేడపాడు వంతెన వరకు 2.6 కిలోమీటర్ల పొడవైన బీటీ రోడ్డు, తాపేశ్వరం, ఇప్పనపాడు గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉంది. ఇప్పటికే జెడ్ మేడపాడు నుంచి ఇప్పనపాడు రైస్ మిల్లు వరకూ 2.4 కిలోమీటర్ల పొడవైన బీటీ రోడ్డు నిర్మాణం పూర్తికావడంతో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. తాపేశ్వరం, ఇప్పనపాడు గ్రామాల్లో 1,850 మీటర్ల మేర ఒక వైపు,750 మీటర్ల మేర రెండు వైపులా సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. మొత్తం 5.5 మీటర్ల పొడవున్న ఈ రోడ్డును భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఏడు నుంచి 10 మీటర్ల వెడల్పు చేసి, అభివృద్ధి చేస్తున్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా 10 పెద్ద చెట్లు, మరో 20 వరకూ చిన్నచిన్న చెట్లను తొలగించాల్సి వస్తోందని ఆర్ అండ్ బీ అధికారులు గుర్తించారు. వాటి తొలగింపునకు ఉన్నతస్థాయి నుంచి అనుమతులు రావడంతో పనులు చేపట్టారు. చెట్ల తొలగింపునకు అనుమతులు రావడంలో ఆలస్యం వల్ల పనుల్లో జాప్యం జరిగిందని ఆర్ అండ్ బీ జేఈ సూర్యనారాయణ తెలిపారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆదేశాల మేరకు రెండో వైపు సీసీ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్డులో తాపేశ్వరంలో ఒకటి, చినద్వారపూడి రెండు కల్వర్టులను నిర్మించాల్సి ఉందన్నారు. కాలువల మూసివేత అనంతరం ఈ పనులు చేపడతామని తెలిపారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయండి



డీఈ దుర్గాప్రసాద్‌ను అభివృద్ధి పనులపై ఆరా తీస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం: పురపాలక పరిధిలో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణాలు తదితర అభివృద్ధిపనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆదేశించారు. పురపాలక సంఘం కార్యాలయంలో మంగళవారం కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా మంత్రి వేణు పాల్గొన్నారు. తొలుత అజెండాలోని నాలుగు అంశాలను సీవో ఇంత రాంజీ కౌన్సిల్ సభ్యులకు చదివి వినిపించారు. హౌసింగ్ బోర్డులోని ఎండిపోయిన చెట్లను తొలగించి కొత్త మొక్కలను నాటేందుకు బహిరంగ వేలంకు సంబంధించిన అంశంతో పాటుగా మరో రెండు అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పట్టణంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్న తీరును డీఈ దుర్గాప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. పనులు జరుగుతున్న వివరాలను ఆయన మంత్రికి తెలియజేశారు. తాగునీటి పైప్‌లైన్ల నిర్మాణంతో పాటుగా అన్ని రకాల పనులను కాంట్రాక్టర్లతో మాట్లాడి త్వరతిగతిని పూర్తి చేయాలన్నారు. వైస్ చైర్మన్లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, విప్ వాడ్రేవు సాయిప్రసాద్, కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ప్రజలకు వారధిలా పనిచేయాలి

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- మూడు గ్రామాల గృహ సారథులకు దిశా నిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య గృహ సారథులు వారధిలా పనిచేసి వైఎస్సార్ సీపీ బలోపేతానికి పాటుపడాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సూచించారు. మండలంలోని మెర్నిపాడు, వైసీతానగరం, ఏడిద గ్రామాల్లోని గృహ సారథులకు మంగళవారం ఏడిద వాసవి ఫంక్షన్ హాలులో అవగాహన సమావేశం నిర్వహించారు. పార్టీ నేత పలివెల సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ తోట ముఖ్య అతిథిగా హాజరై గృహసారథుల బాధ్యతలు, విధులను వివరించారు. గృహ సారథులు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా వారికి చేకూరిన లబ్ధిని, పేదల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్న పాలన గురించి వివరించాలన్నారు. అర్హులందరికీ పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలన్నారు. పార్టీ రాష్ట్ర నేతలు కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, పార్టీ నాయకులు గారపాటి అశోక్‌కుమార్, వరదా చక్రవర్తి తదితరులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాలు, పింఛన్ల కోసం పేదలు జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదని గుర్తుచేశారు. సీఎం జగన్ పాలనలో ఎక్కడికి వెళ్లాల్సిన పనిలేకుండా అన్ని పథకాలు ఇంటికే అందుతున్న విషయాన్ని గృహసారథులు ప్రజలకు తెలియజేయాలన్నారు. సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, ఆర్‌బీకే మండల కమిటీ డైరెక్టర్ చిలుకూరి బుజ్జి, జేఎస్‌సీ మండల కన్వీనర్ బందెల సాయిరాం, పార్టీ నాయకులు వేగిరాజు సురేష్, అడ్డాల రామారావు, తాతపూడి రాజేష్ పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్

మంత్రి వేణు



రామచంద్రవపురంలో విలియం హో చిత్రపటానికి నివాళులర్పించిన మంత్రి వేణు

రామచంద్రపురం: ఆపదలో ఉన్న పేదవారి కష్టాలను తన కళ్లతో చూసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల ద్వారా ఆదుకోవటమే కాకుండా నిత్య కష్టజీవులుగా ఉన్న టైలర్లకు చేదోడుగా నిలిచారని రాష్ట్ర బీసీ సంక్షేమం శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలో టైలర్స్ డే దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ టైలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిలో విలియం హో చిత్రపటంతో ర్యాలీ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదురుగా డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో మంత్రి వేణు పాల్గొని కుట్టుమెషీన్ విలియం హో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీఎం జగన్ చిత్రపటానికి టైలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, మున్సిపల్ వైస్ చైర్మన్లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్లు వాడ్రేవు సాయిప్రసాద్, కేతా శ్రీను, బావాల మంగామణి, మేడిశెట్టి వెంకటలక్ష్మి, కో ఆప్షన్ సభ్యులు గుబ్బల గణ, ఎంఎస్‌కే మస్తాన్ పార్టీ నేతలు కొండేపూడి సురేష్, బావాల భద్రరావు, టైలర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కాజులూరులో..

కాజులూరు: సీఎం జగన్ దయవల్ల రాష్ట్రంలోని గ్రామీణ టైలర్లకు చేతినిండా పని దొరికిందని మండల టైలర్ల యూనియన్ అధ్యక్షుడు ఉడతా గోపాలకృష్ణ అన్నారు. గొల్లపాలెంలో మంగళవారం స్థానిక గ్రామ టైలర్ల సంఘం అధ్యక్షుడు నాలి కోటేశ్వరరావు అధ్యక్షతన అంతర్జాతీయ టైలర్స్ డే నిర్వహించారు. కుట్టుమెషీన్ సృష్టికర్త విలియమ్స్ హో చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పుట్టినరోజు కేక్ కట్ చేసి సభ్యులకు పంచారు. కార్యక్రమంలో టైలర్ల సంఘం కార్యదర్శులు పిల్లి అప్పలకొండ, గోపి మురళీకృష్ణ, త్రిమూర్తులు, చీపూరి శ్రీనివాసు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: శ్రీఛాయా సోమేశ్వర టైలర్ల సంఘం ఆధ్వర్యంలో టైలర్స్ డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కె.గంగవరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తొలుత కుట్టుమెషీన్ సృష్టికర్త విలియం హో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం టైలర్స్ కుటుంబ సభ్యులు, వారి స్నేహితులతో సహపంక్తి భోజనాలు చేసి రోజంతా ఉల్లాసంగా గడిపారు. సీనియర్ టైలర్లను సన్మానించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. అధ్యక్షుడు కుడుపూడి చంద్రరావు, టెజరర్ భీష్మాచార్యులు, కార్యదర్శి శీలామంతుల బాలాజీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

టైలర్ల సొసైటీలకు గుర్తింపు ఇవ్వాలి

మండపేట: టైలర్ల సొసైటీలకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలని మండపేట పట్టణ టైలర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రేకపల్లి శ్రీనివాస్ కోరారు. టైలర్స్ వేడుకలను పట్టణంలో మంగళవారం సంఘ నాయకులు ఘనంగా నిర్వహించారు. కుట్టుమెషీన్ సృష్టికర్త విలయమ్స్ హో చిత్రపటానికి శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు పీఎస్ మూర్తి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తమ సమస్యలపై అధికారులకు వినతి పత్రం అందజేశారు. సంఘ నాయకులు వేమగిరి శ్యామ్‌బాబు, వింజరపు శ్రీనివాస్, బీరక సాంబశివరావు, ఎం.కనకదుర్గ, రేకపల్లి సుధ పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: విశ్వ వ్యాప్తంగా కోట్లాది మందికి ఉపాధి మార్గాన్ని చూపిన విలియం హోకు మండలంలోని పలు గ్రామాల టైలర్లు ఘన నివాళి అర్పించారు. అంగర ఆదిగణపతి టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం టైలర్స్ డే నిర్వహించారు. సీనియర్ నాయకులు పసలపూడి సుబ్బారావును సత్కరించారు. నాయకులు సోమేశ్వరరావు, కృష్ణ, ప్రసాద్, పోలరాజు, స్వామి, సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ యంత్ర వినియోగం వల్ల తమకు ఉపాధి కరువవుతోందని వాపోయారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

- జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ చల్లా
- ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు సైన్స్ క్విజ్ పోటీలు




విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ రవికుమార్

మండపేట: విద్యార్థి దశ నుంచి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్తులో అద్భుతాలు సృష్టించవచ్చని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ చల్లా రవికుమార్ పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక గౌతమి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జేవీవీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైన్స్ క్విజ్ పోటీలు జరిగాయి.

సీనియర్స్ విభాగంలో గౌతమీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ఎస్.దినేష్, టి. హరీష్, కేతా ర్‌ఎస్‌ఎస్ శ్యామ్‌కుమార్ ప్రథమస్థానం, ఎస్. పావని, పి.అనూష, ఎస్. నీహారికలు ద్వితీయ స్థానం సాధించగా, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు పి.కనకదుర్గ, బి.అమృత, ఎస్.ప్రిన్సీ తృతీయస్థానం సాధించారు. జూనియర్స్ విభాగంలో గౌతమి మున్సిపల్ పాఠశాలకు చెందిన ఎస్. దీక్షిత, ఎస్. వైష్ణవి, వి. శ్రీలక్ష్మి ప్రథమస్థానం, వైజే చంద్రిక, పి.భార్గవి, వై. మోహన వెంకటదుర్గ ద్వితీయ, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన వై.రమ్య, షేక్ శహనాజ్ తృతీయ స్థానం సాధించారు. విజేతలకు రవికుమార్ బహుమతులు అందజేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం వల్లూరి సూర్యలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జేవీవీ నాయకులు జి.స్వామి ప్రసాద్, పి.రామచంద్రారెడ్డి, బి. రాజేంద్ర, జి సుధాకర్, యు.గుణ, కె ఏసుబాబు, యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ కే. గోపాలకృష్ణారెడ్డి, కె.సత్తి బాబు, వి. నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రోమోర్ సెంటర్ ఎదుట రైతుల ఆందోళన



కాజులూరు మనగ్రోమోర్ సెంటర్ ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

కాజులూరు: పంటలపై సోకు పురుగులు, తెగుళ్ల నివారణకు అవసరమైన మందులు కొనుగోలు చేస్తేనే రైతులకు అవసరమైన ఎరువులు విక్రయిస్తామంటూ కాజులూరులో మనగ్రోమోర్ సెంటర్ సిబ్బంది ఆంక్షలు విధిస్తుండటంతో స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల గ్రామాల్లో ప్రస్తుతం వరి పంట పిలకలు తొడిగే దశ నుంచి చిరుపొట్ట దశలో ఉంది. ఈ దశలో పంటకు కాంప్లెక్స్ ఎరువులు ఎక్కువగా అవసరమౌతుంది. మండలంలో దాదాపు అందరు రైతులకు ఒకేమారు కాంప్లెక్స్ ఎరువులు అవసరమవటంతో డిమాండ్ పెరిగి ఎరువుల కొరత ఏర్పడింది. మండల గ్రామాల్లోని ఎరువుల షాపుల్లో కాంప్లెక్స్ ఎరువుల స్టాకు తక్కువగా ఉండటంతో రైతులు కాజులూరులో పెద్ద షాపు అయిన మనగ్రోమోర్ సెంటరుకు క్యూ కడుతున్నారు. దీనిని అదనుగా తీసుకుని సిబ్బంది మందులు కొంటేనే ఎరువులు విక్రయిస్తామని నిబంధన పెట్టి రైతులకు అవసరం లేని నాసిరకం మందులను బలవంతంగా అంటగడుతున్నారు. దీనిపై మంగళవారం పలువురు రైతులు షాపు ఎదుట ఆందోళనలు వ్యక్తం చేశారు. దీనిపై మండల వ్యవసాయాధికారి వి.అశోక్‌ను వివరణ కోరగా గ్రోమోర్ సిబ్బంది తీరుపై తమకు ఫిర్యాదులు అందాయని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



రాయవరంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ జీఎస్ఎన్‌రెడ్డి తదితరులు

మండపేట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ అంశాల్లో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు కేఎస్ఆర్ ఆనందరావు, త్రినాథ్, కిరణ్‌కుమార్, నెహ్రూ నాయక్, ఆశిష్‌బాబు, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.అలాగే పట్టణంలోని ఆలమూరు రోడ్డులోని విజ్ఞాన్ స్కూల్, తాపేశ్వరంలోని శ్రీచైతన్యలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కపిలేశ్వరపురం: మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సైన్స్ దినోత్సవంలో శాస్త్రవేత్త సీవీ రామన్‌కు నివాళి అర్పించారు. కొన్నేళ్ళుగా పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రొఫెసర్ గొడవర్తి భగవాన్ పర్యవేక్షణలో మాచర వెల్ఫేర్ అల్యూమిన్ అసోసియేషన్ పేరుతో కృషి చేస్తున్నారు. భగవాన్ సౌజన్యంతో రూ.70 వేలతో ఏర్పాటు చేసిన డిజిటల్ రూమ్‌ను సర్పంచ్ వాసంశెట్టి సునీత, ఉప సర్పంచ్ అడపా వేణు బాబ్జీ ఆవిష్కరించి దాతను కొనియాడారు. వాకతిప్ప పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యాధికారి జె.అనూజ ప్రియాంక, పూర్వ విద్యార్థి మట్టపర్తి సత్యనారాయణలను పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సత్కరించారు. తాము తయారు చేసిన సృజనాత్మక సైన్స్ ఆవిష్కరణలను విద్యార్థులు ప్రదర్శించారు.

రాయవరం: స్థానిక శ్రీరామయ్య జెడ్పీ హైస్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవం హెచ్‌ఎం పప్పు శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో చాణక్య ఆస్పత్రి అధినేత డాక్టర్ జీఎస్ఎన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ఎక్స్‌పో అలరించింది. సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ జీఎస్ఎన్‌రెడ్డి రూ.10 వేల నగదును పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డికి అందజేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. తొలుతగా సీవీ రామన్ చిత్రపటానికి డాక్టర్ జీఎస్ఎన్‌రెడ్డి, పీఎంసీ చైర్మన్ నల్లమిల్లి నరేంద్రరెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే రాయవరం, వెదురుపాక, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కుర్మాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఆయా పాఠశాలల హెచ్‌ఎంల ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం కేకేఎల్ కుమారి ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు.

కాజులూరు: సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకుని ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలని గొల్లపాలెం జెడ్పీ స్కూల్ హెచ్‌ఎం కె.వెంకటలక్ష్మి అన్నారు.

కె.గంగవరం: మండలంలోని దంగేరు, సత్యవాడ, పామర్రు, కోటిపల్లి, కె.గంగవరం ఉన్నత పాఠశాలల్లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో క్విజ్, సైన్స్ మోడల్స్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

నేడు ఠంఛన్‌గా పింఛన్

- పంపిణీకి పూర్తయిన ఏర్పాట్లు
- క్లస్టర్ పరిధిలో 63,354 మంది లబ్ధిదారులకు రూ.17.23 కోట్లు..

రాయవరం: తెల్లవారితే పింఛన్‌దారుల కళ్లల్లో ఆనందం తొణికిసలాడనుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి నెలా ఠంఛన్‌గా పింఛను అందిస్తోంది. ప్రతి నెలా మాదిరిగానే మార్చి నెల పింఛన్లను అందించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. రామచంద్రపురం, మండపేట క్లస్టర్ పరిధిలోని రామచంద్రపురం, మండపేట అర్బన్, రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం మండలాల పరిధిలోని 63,354 మంది వివిధ రకాల పింఛనుదారులకు బుధవారం వేకువజాము నుంచే పింఛన్లను అందించనున్నారు. వీరందరికీ రూ.17,23,91,500 అందించనున్నారు. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులు పింఛను సొమ్మును బ్యాంకు నుంచి విత్‌డ్రా చేసి, లబ్ధిదారులకు అందించేందుకు సిద్ధం చేశారు. వేకువజామున ఐదు గంటల నుంచే లబ్ధిదారులకు సొమ్మును పంపిణీ చేయనున్నారు. ఫింగర్ ప్రింట్, ఆధార్ బేస్డ్ ఫేస్ రికగ్నిషన్ ద్వారా లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు రాయవరం ఎంపీడీవో డి.శ్రీనివాసు తెలిపారు.

గృహ సారథులతో నేడు ఎమ్మెల్సీ తోట భేటీ

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల గృహ సారథులతో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమావేశం కానున్నట్లు వైఎస్సార్ సీపీ మండల నాయకులు తెలిపారు. అంగర ప్రధాన రహదారిలోని శ్రీవీరవెంకట సత్యనారాయణ కన్వెన్షన్ హాల్లో బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం ప్రారంభం కానుంది. 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంపై గృహ సారథులకు ఎమ్మెల్సీ దిశా నిర్దేశం చేసే లక్ష్యంతో సమావేశం నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

మండపేట: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకుడు దూలి జయరాజు కోరారు. మండపేటలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆ దిశగా కేంద్రాన్ని ఒప్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి గాలింకి నాగేశ్వరరావు, మాదిగ వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు షేక్ నబీ, ఎమ్మార్పీఎస్ నాయకులు సూరిబాబు, డి. రాజుబాబు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

మండపేట: మండలంలోని మెర్నిపాడు సాయిబాబా ఆలయం 14వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సాయినాథునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామంతో పాటు వెలగతోడు, పాలతోడు, వై.సీతానగరం, జేగురుపాడు తదితర గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మూడు వేల మందికి అన్న సమారాధన జరిగింది. సాయంత్రం సాయినాథుని పల్లకీసేవ వేడుకగా సాగింది. మెర్నిపాడు సర్పంచ్ గారపాటి సౌజన్య, వైఎస్సార్ సీపీ నేత అశోక్‌కుమార్ దంపతులు, తొర్రేడు బాలాజీ బిల్డర్స్ అధినేత గారపాటి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ

కె.గంగవరం: గ్రామంలో అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం సందర్భంగా మంగళవారం ప్రగతిశీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. పీఓడబ్ల్యూ డివిజన్ అధ్యక్షులు సిర్రా మార్తమ్మ మాట్లాడుతూ జాతీయ కార్యవర్గం పిలుపు మేరకు మార్చి 1 నేటి నుంచి 8 వరకు ర్యాలీలు, ప్రదర్శనలు, ధర్నాలు, సదస్సులు నిర్వహించాలన్నారు. దీనిలో భాగంగానే ఈ నెల 4వ తేదీన కె.గంగవరం భారీ సదస్సు నిర్వహిస్తామని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మహిళా నాయకులు పి.శాంతి, నక్షత్రకుమారి, సుజనమ్మ, బేబి, ఆర్.లక్ష్మీ నాగమణి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

144 మందికి ఆధార్ నవీకరణ

కపిలేశ్వరపురం: మండలంలోని వెదురుమూడి, తాతపూడి గ్రామ సచివాలయాల్లో ఈనెల 27 నుంచి రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక కేంద్రాల్లో 144 మంది ఆధార్ కార్డులను నవీకరించారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన ఆయా శిబిరాల్లో ప్రత్యేక శిక్షణ పొందిన డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి వీరమల్లేశ్వరరావు, కోరా దొరబాబులు లబ్ధిదారుల వేలిముద్రలు, ఫొటో, ఐరిష్‌లతో పాటు పేరు, చిరునామా తదితర వివరాలను నవీకరించారు.

యశోదమ్మ మృతి



యశోదమ్మ (ఫైల్)

రామచంద్రపురం రూరల్: ప్రసిద్ధి చెందిన ఆదివారపుపేట శ్రీ శివబాలయోగి మహరాజ్ ఆశ్రమ నిర్వాహకురాలు, ఆదివారపుపేట బాలయోగి శిష్యురాలు యశోదమ్మ (70) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. శ్రీలంక దేశానికి చెందిన ఆమె బాలయోగికి సన్నిహిత శిష్యురాలిగా బెంగళూరు ఆశ్రమ నిర్వహణ చూసేవారు. అయితే 1994 బాలయోగి మృతితో ఆయన సమాధి అయిన ఆదివారపుపేటలోనే ఉండేందుకు నిర్ణయించుకుని అప్పటి నుంచి ఇక్కడే ఉండిపోయారు. చేనేతపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఆదివారపుపేట గ్రామస్తులు ఆమె మృతికి సంతాపంగా తమ పనులు నిలిపివేశారు. భక్తుల సందర్శనార్థం ఆమె పార్థివ దేహాన్ని ఆశ్రమంలో ఉంచారు. స్థానికులతో పాటు వివిధ జిల్లాలు, వివిధ రాష్ట్రాల నుంచి, శ్రీలంక నుంచి స్వామీజీ భక్తులు ఆశ్రమానికి చేరుకున్నారు. వారందరి సమక్షంలో నేటి ఉదయం బాలయోగి సమాధికి సమీపంలో యశోదమ్మకు అంత్యక్రియలు నిర్వహించనున్నారు.